భూకంప బాధితులను ఆదుకోవాలి

- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నారాయణపూర్‌లో దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, మే 7: భూకంపంతో ఇండ్లు దెబ్బతిన్న బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం భూకంపంతో నారాయణపూర్ గ్రామానికి సుంకె పరశురాములు, మ్యాకల శ్రీనివాస్‌కు చెందిన ఇండ్లు దెబ్బతినగా, బుధవారం సుంకె రవిశంకర్ పరిశీలించారు. బాధితులకు ప్రభుత్వం తక్షణమే డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ నజీర్, నేత గర్వందుల పరశురాములు ఉన్నారు.

'ఇందిరమ్మ కమిటీ'తో అర్హులకు అన్యాయం

- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి

చిగురుమామిడిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి

చిగురుమామిడి, మే 7: ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరుగుతుందని, ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో ఈ జాబితాను రూపొందించడంలో ఆంతర్యం ఏమిటని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ఇల్లు లేని వారికి, కిరాయి గృహాల్లో ఉన్నవారికి కాకుండా.. ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి అనుకూలంగా ఉన్న వారికే మంజూరు చేస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో ఆ పార్టీ నాయకులే పోస్టులు పెడుతున్నారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తక్షణమే స్పందించి మండలంలో అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. మొదటి విడుతలో ఎంపికైన గునుకుల పల్లె గ్రామ పంచాయతీలో ఏఈ సమక్షంలో ముగ్గు పోసిన ఇంటికి బిల్లు రాకుండా అడ్డుకుంటున్నారని, 400చదరపు అడుగుల నుంచి 600 వరకు ఉండాలనే నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. నిజమైన అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయకపోతే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ రమణారెడ్డి, ఆర్‌బీఎస్ మండల మాజీ కన్వీనర్ పెనుకుల తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి పేసరి రాజేశం పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్ టౌన్, మే 7: హుజూరాబాద్‌లో అదనపు జిల్లా కోర్టును ఏర్పాటు చేయాలని హుజూరాబాద్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు యతిపతి అరుణ్‌కుమార్ అధ్వర్యంలో బుధవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో హుజూరాబాద్ బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బండి సంజయ్‌ని కలిసి సన్మానించారు. ఇక్కడ హుజూరాబాద్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎర్రోళ్ల రమేశ్, ఉపాధ్యక్షుడు నూతల శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, సీనియర్ న్యాయవాది నల్ల భూమిరెడ్డి, న్యాయవాది వంశీ కృష్ణ ఉన్నారు.

'సన్నాల' కొనుగోళ్లపై జాప్యం

దుర్గేడ్‌లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా వేస్తున్న హమాలీలు

- కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నిరీక్షణ
- వేసవిలో వరి ధాన్యం సేకరణలో జాప్యం
- ఆందోళనలో అన్నదాతలు
- వెంటనే వడ్లు కొనాలని డిమాండ్

కరీంనగర్ రూరల్, మే 7: రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వరి ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. కరీంనగర్ మండలంలో ఈ యాసంగిలో 13,210 ఎకరాల్లో వరి సాగు వేశారు. 11,110 ఎకరాల్లో దొడ్డు రకం సాగు వేయగా, 2,100 ఎకరాల్లో సన్నాలు వేశారు. మొత్తం 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. వరి కోతలు చేసి రైతులు సన్నరకం వడ్లను కొనుగోలు కేంద్రాలను తీసుకువచ్చి.. సెంటర్లలో నిరీక్షించడం తప్పా.. చేసేదేమీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సన్నాలకు రైస్‌మిల్లులను కేటాయించపోవడంతో పాటు, లారీ, ట్రాక్టర్ల లోడ్ కాకపోవడంతో నిర్వాహకులు సన్న ధాన్యం కాంటా పెట్టేందుకు ముందుకు రావడంలేదు. ప్రస్తుతం దుర్గేడ్, చేగుర్తి, జూబ్లినగర్, చెర్లభూత్కూర్, చామనపల్లి, నగునూర్ గ్రామాల్లోని కేంద్రాలల్లో సన్నరకం ధాన్యం కుప్పలున్నాయి. ధాన్యం సెంటర్లను ఆలస్యంగా ప్రారంభించడంతో కొందరు రైతులు సన్నాలను రైస్‌మిల్లులకు విక్రయించారు. మరి కొందరు రూ.500 బోనస్ ఆశతో ధాన్యం కొనుగోళ్లు కేంద్రాలకు తీసుకువచ్చారు. సన్నాలు తక్కువ రావడంతో సెంటర్ నిర్వాహకులు కాంటా పెట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు చామనపల్లిలో 235, బహ్దర్‌ఖాన్‌పేటలో 28, ఫకీర్‌పేటలో 150క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేశారు. కరీంనగర్, దుర్గేడ్, సింగిల్ విండో పరిధిలో సన్నాలు కొనుగోలు చేపట్టలేదు. ఈ విషయమై కరీంనగర్ సీఈవో రమేశ్, దుర్గేడ్ సీఈవో వణుమాధవ్‌ను సంప్రదించగా, సన్నాలు అధికంగా రాలేదని, త్వరలోనే ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు.

అకాల వర్షాలతో ఆగమాగం

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించింది. మరో వైపు గాలిదుమారం, అకాల వర్షాలు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. యాసంగిలో వరి సాగు చేయడం కంటే ధాన్యం అమ్ముకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కాంటాలు ఆలస్యం కావడంతో కొనుగోలు కేంద్రాలల్లో రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు.

దుర్గేడ్‌లో సన్న ధాన్యంపై కప్పి ఉన్న కవర్లు

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరించిన ఎమ్మెల్యే

కొత్తపల్లి, మే 7: మండలంలోని బద్దిపల్లి గ్రామంలో ఈ నెల 17 నుంచి 19 వరకు జరుగనున్న శ్రీ అలివేలు మంగ పద్మావతి శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రచార కరపత్రాన్ని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బుధవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఇక్కడ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, తాండ్ర శ్రీనివాస్, పోరెడ్డి నరేందర్, రాచమల్ల నితీన్‌రెడ్డి, రాచమల్ల మనోజ్, కూన నాగరాజు, తదితరులు ఉన్నారు.

రైతును బలిగొన్న జాతీయ రహదారి

- ఎకరన్నరతో పాటు బావి పోవడంతో తీవ్ర మనోవేదన
- గుండెపోటుతో మృత్యువాత

రాజ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

హుజూరాబాద్, మే 7: 563వ జాతీయ రహదారి నిర్మాణం ఓ రైతు నిండు ప్రాణాన్ని బలిగొంది. భూ పరిహారం విషయంలో అధికారుల తీరు కారణంగా తీవ్ర మనోవేదనతో అతని గుండె ఆగిపోయింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రహదారి నిర్మాణంలో భాగంగా మండలంలోని పెద్దపాపయ్యపల్లికి చెందిన రైతు కంకణాల రాజ్‌కుమార్‌రెడ్డి(49)కి ఆరు ఎకరాల వ్యవసాయభూమి ఉండగా, ఇందులో ఎకరన్నరతోపాటు బావి రహదారి నిర్మాణంలో పోయింది. ఇక్కడ మార్కెట్ విలువ ప్రకారం ఎకరానికి ₹4 కోట్లు పలుకుతుండగా, ఎకరన్నరతోపాటు బావికి పరిహారం కింద రాజ్‌కుమార్‌రెడ్డికి ప్రభుత్వం కేవలం ₹43లక్షలు మాత్రమే అందించింది. రోడ్డు నిర్మాణంలో భాగంగా ఫ్లైఓవర్, వరద కాలువ నిర్మించడంతో మిగతా భూమికి విలువ లేకుండాపోయింది. సర్వీస్‌రోడ్లు, మురుగు నీటి కాలువ గురించి అధికారులకు విన్నవించుకున్నా పట్టించు కోలే దు. పైపెచ్చు వరదకాలువ నిర్మాణం ఆపలేదు. దీంతో రాజ్‌కుమార్ ఇటీవల హైకోర్టులో పిటిషన్ వేశాడు. దీనికి అనుగుణంగా సంబంధిత అధికారులకు నోటీసులు ముట్టినా స్పందించలేదు. అంతే కాకుండా, నోటీసులు కాదని రెండుమూడు రోజుల నుంచి పనిచేస్తున్నారు. ఈ విషయం గురించి తన భార్యతో చర్చిస్తూనే రాజ్‌కుమార్‌రెడ్డి బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. అతడికి భార్య కల్పన, కూతురు శివాని ఉన్నారు.

ఎమ్మెల్యేకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు

ఎమ్మెల్యే కమలాకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కరీంనగర్ రూరల్: మే 7: ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు మండల స్థాయి నాయకుల ముందస్తుగా జన్మదిన శుభకాంక్షలు తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని నివాసంలో ఎమ్మెల్యేను పీఏసీఎస్ చైర్మన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఉప్పు శ్రీధర్, మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు సత్కరించి ముందస్తుగా బర్త్‌డే విషెస్ చెప్పారు.

వెరిఫికేషన్ పారదర్శకంగా ఉండాలి

కార్పొరేషన్, మే 7: రేషన్‌కార్డు లబ్ధిదారుల వెరిఫికేషన్ పారదర్శకంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ అధికారులను కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ నగరంలోని 53, 59, 60 డివిజన్లలో పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నేపథ్యంలో అధికారులు చేస్తున్న వెరిఫికేషన్‌ను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రేషన్‌కార్డుల లబ్ధిదారుల ఎంపిక వెరిఫికేషన్ ప్రక్రియ నిబంధనల ప్రకారం వెరిఫికేషన్ చేసి, సరైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఇక్కడ డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్ ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మానకొండూర్, మే 7: కరీంనగర్ మెడికవర్ దవాఖాన ఆధ్వర్యంలో బుధవారం చెంజర్ల గ్రామంలోని దిలీప్ బ్యూల్డ్‌కాన్ కంపెనీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు కంపెనీలోని ఉద్యోగులు, సిబ్బందికి షుగర్, బీపీ, 2డీఏకో తదితర వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఇక్కడ దవాఖాన సిబ్బంది గుర్రం కిరణ్, కోట కరుణాకర్, మనోజ్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర, మే 7: మండల కేంద్రంలోని తహసీల్, మండల పరిషత్, సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం తనిఖీ చేశారు. తహసీల్ కార్యాలయంలో రేషన్‌కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ, పెండింగ్ మ్యుటేషన్లు, భూసమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మండల పరిషత్‌లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి సొంత భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కార్యాలయానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. మధురానగర్ చౌరస్తాలో దుమ్ముతో ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు తెలుపగా, అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జాగిరపు రజితా శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేముల భాస్కర్, నాయకులు వొడ్నాల యజ్ఞేష్, పురుమల్ల మనోహర్, వేముల అంజి, దాతు అంజి, పెంచాల చందు, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌తో శక్తి సామర్థ్యాలు పెంపొందుతాయి

కొత్తపల్లి, మే 7: అథ్లెటిక్స్‌తో శక్తిసామర్థ్యాలు, వ్యక్తిగత నైపుణ్యాలు పెంపొందుతాయని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వీ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో వరల్డ్ అథ్లెటిక్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారులకు పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని, చిన్నారుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభ పోటీల ద్వారానే బయటకు వస్తుందన్నారు. పోటీల ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నందేల్లి మహిపాల్ విజేతలకు మెడల్స్, బహుమతులను ప్రదానం చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన 200మంది క్రీడాకారులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. అనంతరం వరల్డ్ అథ్లెటిక్స్ డే కేక్‌ను కట్ చేసి.. క్రీడాకారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడారి రవి, అథ్లెటిక్స్ సంఘ సభ్యులు హరికిషన్, ఎస్ రమేశ్, అథ్లెటిక్ కోచ్‌లు వరుణ్ కృష్ణన్, కిరణ్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో గలాటా

- కొత్త, పాతవర్గాల బాహాబాహి

గన్నేరువరం, మే 7: మండల కాంగ్రెస్‌లో గలాటా మొదలైంది. కొద్ది రోజులుగా కొత్త వర్గం, పాత వర్గం ఏర్పడి వారివారి ఉనికిని చాటుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మొదటి నుండి ఉన్నవారికే పదవులు ఉండాలని, మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పాతవర్గం పట్టుబడుతుంటే.. ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన నాయకులు వారికి సముచిత స్థానం కావాలని వివిధ పదవుల కోసం పోటీపడుతున్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడి మార్పు చేయాలని కొందరు, పాత వ్యక్తి ఉండాలని కొంతమంది పట్టుపట్టారు. దీంతో మండలాధ్యక్షుడు నియామకం కోసం ఇరువర్గాలు నామినేషన్లు దాఖలు చేయగా, అదికాస్త పార్టీ పెద్దల సమక్షంలో మాటమాట పెరిగి.. తోపులాటకు దారితీసింది. కొద్దిసేపు ఫంక్షన్‌హాల్ ప్రాంగణం రణరంగంగా మారింది. ఇరు వర్గాలు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వద్దకు చేరుకొని, వారివారి గోడు వెళ్లబోసుకున్నట్లు సమాచారం.

కృత్రిమ కాలు అందజేత

జమ్మికుంట, మే7: మడిపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ మ్యాకమల్ల మొగిలి ఐదేండ్ల క్రితం వ్యవసాయ పనులు చేస్తుండగా, కుడి కాలుకు కొయ్య గుచ్చుకున్నది. కొద్దిరోజుల తర్వాత కాలు ఇన్‌ఫెక్షన్ కాగా, తప్పనిపరిస్థితుల్లో వైద్యులు కాలు తొలగించారు. అప్పటి నుంచి మొగిలి ఇబ్బంది పడుతున్నాడు. ఇటీవల బాధితుడు ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గుణసాగర్‌ను కలిసి, తన గోడు చెప్పుకొన్నాడు. వెంటనే గుణసాగర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరికి పండ్ల నరహరి (ఐఏఎస్)కి సమాచారం అందించారు. ఆయన హైదరాబాద్‌లోని మహావీర్ ట్రస్ట్ సౌజన్యంతో జైపూర్ నుంచి బాధితుడు మొగిలికి కృత్రిమ కాలును తెప్పించారు. సదరు కాలును బాధితుడికి బుధవారం కో-ఆర్డినేటర్ అందించారు. కృత్రిమ కాలును అందించిన ఆలయ ఫౌండేషన్ నిర్వాహకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి సుంకె పరామర్శ

చొప్పదండి, మే7: ఆర్నకొండలో నాయకుడు కోమల్ల రాజేశం తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మాచర్ల వినయ్‌కుమార్, మామిడి రాజేశం తదితరులు ఉన్నారు.

మంత్రికి బీసీ సంఘాల కృతజ్ఞతలు

తెలంగాణచౌక్, మే 7: కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలనే నిర్ణయానికి సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎంపీని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, స్వీట్లు తినిపించారు.

జయంతిని అధికారికంగా నిర్వహించాలి

తెలంగాణచౌక్, మే 7: సంఘ సంస్కర్త మ్యాదరి భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను ఈ నెల 22న ప్రభుత్వం అధికారికంగా నిర్వ హించాలని మాల జేఏసీ చైర్మన్ బొగ్గుల మల్లేశం, జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య రాష్ట్ర ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం నగర మున్సిపల్ కమిషన ర్ చాహత్ భాజ్‌పాయ్, సోషల్ వెల్ఫేర్ డీడీ పవన్‌కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. ఇక్కడ దండి రవీందర్, మద్దెల రాజేందర్, వివేక్, మహేశ్, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

కలెక్టరేట్, మే 7: అకాల వర్షాల నేపథ్యంలో రైతుల నుంచి వెంట నే వరి ధాన్యం కొనుగోలు చేయాలని ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ జిల్లా కన్వీనర్ పొల్సాని సంపత్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని పద్మనగర్‌లో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో వార్షిక సమావేశం నిర్వహించగా పలు మండలాల రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా రైతాంగాన్ని దగా చేస్తోందని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు గాలికొదిలిందని మండిపడ్డారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బైకని మల్లయ్య, ఉపాధ్యక్షులుగా సారబుడ్ల వెంకటరెడ్డి, ముత్తినేని అశోక్‌రావు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ రవీందర్‌రావు, కోశాధికారిగా కనుకుంట్ల రామాంజనేయులు ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 7: నగరంలో 11కేవీ ఫీడర్ మెయింటనెన్స్, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1, 2 ఏడీఈలు పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఎం లావణ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి 9గంటల వరకు ఎన్టీఆర్ చౌరస్తా, కొత్తిరాంపూర్, మై విలేజ్, ఆటో నగర్, బీఎస్ఎన్ఎల్ టవర్, 8.30నుంచి11గంటల వరకు జ్యోతినగర్, గీతాభవన్, కార్పొరేట్ సొసైటీ, 8.30 నుంచి 10.30 గంటల వరకు కశ్మీర్‌గడ్డ, ఉమెన్స్ డిగ్రీ కాలేజీ మెయిన్ రోడ్డు, మైసమ్మ చెట్టు ఏరియా, రైతు బజార్, ముకరంపుర, టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

డ్రగ్స్ నిర్మూలన సామాజిక బాధ్యత

చిగురుమామిడి, మే 7: డ్రగ్స్ నిర్మూలన సామాజిక బాధ్యత అని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్రలో భాగంగా మండలంలో రెండోరోజు ముదిమాణిక్యం, రామంచ, చిన్నముల్కనూర్, కొండాపూర్ గ్రామాల్లో జేఏసీ, ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై జేఏసీ నాయకులు అవగాహన కల్పించారు. ఇక్కడ హుస్నాబాద్ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మీరెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ డ్యాగల సారయ్య, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్, లోడీ సంస్థ ప్రతినిధులు ఉప్పుల కుమారస్వామి, గాండ్ల పద్మ, జేఏసీ బాధ్యులు డాక్టర్ ఎదులాపురం తిరుపతి, వేముల జగదీష్, తాళ్లపల్లి జగన్, తాళ్లపల్లి ప్రభాకర్, ఎర్ర కార్తీక్, సీసీ గంప సంపత్, జీపీ కార్యదర్శి గాజుల శ్రీలక్ష్మి, అమృత వర్షిణి, జగన్‌గౌడ్, రమేశ్, లక్ష్మిరెడ్డి, అచ్చ రవి, రాజేశం, బాబు, వేణు, వెంకటేశం, పైసం లత, మంజుల, వంగర మల్లేశం, వేమునూరి సత్తయ్య, బుర్ర ప్రేమలత, సుజాత పాల్గొన్నారు.

చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన

చొప్పదండి, మే7: రుక్మాపూర్‌లో జీవన్ ఆధార్ సొసైటీ ఆధ్వర్యంలో చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ చిలుక రవీందర్ హాజరై, చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి వివరించారు. రాగులు, సజ్జలు, కొర్రలు, మినుములు, ఉలవలు, పెసలు, జొన్నలు ఇంటి పెరట్లో సాగు చేసుకోవాలని సూచించారు. జీవన్ ఆధార్ సొసైటీ ప్రతినిధి సాకూర్భాయి మాట్లాడుతూ, నేటి నుంచి ఒక పూట చిరుధాన్యాల ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఇక్కడ ఫీల్డ్ అసిస్టెంట్ అంజలీదేవి ఉన్నారు.

కబ్జా స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

జమ్మికుంట, మే7: పట్టణంలోని మోత్కులగూడెంలో కబ్జా చేసిన స్మశాన వాటిక దారి స్థలాన్ని అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే, ఎంపీల ఇండిపెండెంట్ల ఫోరం నాయకులు శ్రీకాంత్, శ్యాంకుమార్, శ్రీనివాస్, సుధాకర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్మశాన దారి స్థలం కబ్జా చేసిన స్థలాన్ని గతంలో రెవెన్యూ అధికారులు గుర్తించారని, బోర్డును కూడా పాతారని తెలిపారు. బోర్డును తొలగించిన ఎంపీఆర్ గార్డెన్ యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలని కోరారు. కబ్జా స్థలాన్ని స్వాధీనం చేసుకోకుంటే కలెక్టరేట్ ఎదురుగా ఆమరణ నిరాహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు.

ఫార్మర్ ఐడీ తప్పనిసరి

శంకరపట్నం, మే 7: ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను కలిగి ఉండాలని మానకొండూర్ ఏడీఏ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన తాడికల్ రైతు వేదికను సందర్శించారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయాలనే లక్ష్యంతో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టినట్లు వెల్లడించారు. రైతులు తమ పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు, ఆధార్‌తో అనుసంధానం చేసిన ఫోన్ నంబర్‌తో క్లస్టర్ల పరిధిలోని ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

వీణవంక, మే 7: ఎలుబాక గ్రామంలో హమాలీలతో కలిసి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పిల్లి రవియాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవియాదవ్ మాట్లాడుతూ, కార్మికులు ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'భూ భారతి'తో సమస్యలు పరిష్కారం

సైదాపూర్, మే7: భూ భారతితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. ఫైలెట్ ప్రాజెక్టులో భాగంగా బుధవారం ఎక్లాస్‌పూర్, రాయికల్ గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పలువురు రైతులు భూ సమస్యలపై అధికారులకు అర్జీలు అందించారు. రెవెన్యూ సదస్సులను కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ దొంత సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త తిరుపతి రెడ్డి, తదితరులు ఉన్నారు.